తెల్లారి అరయింది. ఇద్దరు హెడ్లులూ యస్.ఐ. ఇంట్లో చేతులు కట్టుకొని నుంచునున్నారు యస్.ఐ. వాళ్లని చచ్చేటట్టు చివాట్లు పెడుతున్నాడు : "అంటే వాళ్లున్నారో లేదో చూసుకోకుండానే మీరు ఒకళ్ళనొకళ్ళు కావిలించుకుని అక్కడ పడి నిద్రపోయారన్న మాట! వాళ్లిద్దరూ, కాదు - వాళ్లు ముగ్గురూ కలిసే పారిపోయారన్నమాట! అసలు ఆలోచించి చూస్తే వాళ్లిద్దరి మధ్యా శతృత్వం అనేది కూడా తాత్కాలికంగా ఎవరో కల్పించిందేనన్నమాట! ఆ పుణ్యం ఏదో నువ్వే కట్టుకొనుండొచ్చు. నిన్ననే నాకీ విషయంలో అనుమానం కలిగింది. ఏమంటావ్ ఏకదంతం?... నువ్వీ డర్టీ కేసును నీ ప్రమోషను కోసం పట్టుంటావ్, నాకు తెలుసు. నీకు ప్రమోషను కావాలంటే రెండు దొంగనోట్ల కేసుల్లో, తెగించి కత్తుల్లాంటి రెండు థెఫ్ట్ కేసుల్లో పట్టుకోవయ్యా అని ఎప్పుడో చెప్పాను. ఈ కుర్రాళ్ల కేసులేం కేసులయ్యా! అల్లివ్వాళ విడిపోతారు, రేపు కలుస్తారు. పైగా అసలు వినాయకుడి పూజచేసే వాళ్లే కరువైపోతూన్న రోజులుగదా ఇవ్వి! ఆ ఇద్దర్నీ కలిపి చక్కగా పూజ్జేయించి ఓ నాలుగు కొబ్బరి చెక్కలు స్టేషనుకు తెచ్చుకుంటారా, లేకపోతే అళ్లని చీల్చి అళ్ల చేత పూజ ఎగ్గొటిస్తారా!.... గుర్తుంచుకో, ఎప్పటికైనా మన బతుకులు బాగుపడాలంటే, దేశం బాగుపడాలంటే డిసిప్లినున్న స్టూడెంటు కుర్రాళ్లే మనకి దిక్కు. అళ్లు కలిసుంటం అవసరం. అళ్లకి దైవభక్తి ఉంటం అవసరం... ఏకదంతం! వార్నింగిస్తున్నాను. ఇకనుంచీ ఇటువంటి దిక్కుమాలిన కేసులు తెచ్చావో రివర్షను అయిపోతావు జాగ్రత్త. ఫో!" - యస్.ఐ. లోపలికెళ్లిపోయాడు.

"చవితి చంద్రుణ్ణి చూళ్లేదు. అసలింకా దేవుడికి కొబ్బరికాయే కొట్టుకోలేదు. ప్రమోషన్ పోయి రివర్షన్‌లోకొచ్చిందా నా జాతకం! ఖర్మరా, టూనాట్‌వన్, నా ఖర్మ!" అని గొణుక్కుంటూ బయటికి నడిచాడు ఏకదంతం.

(ఆంధ్ర సచిత్ర వారపత్రిక 7-1-83)

*** *** ***

# మన్మథుని బోను

ఎత్తు ఆ కొండల సొత్తు. ఒత్తు ఆ అడవుల సొత్తు. కొత్త ఆ ఫియట్ సొత్తు. మరి, మరి కళ్లు అ,...అ.. మగువ సొత్తు! పాపికొండల వైపుగా మారేడుమిల్లికి పదిహేను మైళ్ళ దూరంలో ఎత్తయిన కొండల మీద ఇప్పచెట్లు, వెదురు చెట్లున్న ఆ రెండొందల ఎకరాల లోయలో అగ్ని వర్షం కురిపిస్తునట్లు పూలు రాలుస్తున్న కడిమి చెట్టు కిందకొచ్చి ఆగింది జీపు. రెండు పొడవాటి ఆస్ బెస్టాస్ షెడ్లూ, ఒకడజను కాన్వాసు గుడారాలు ఆ చెట్టు చుట్టూ ఉన్నాయి. జీపాగిన నాలుగు క్షణాల తర్వాత ఫియెట్ కారొచ్చి దాని పక్కనే ఆగింది.

జీపులోంచి దిగిన బుజురాయ్, కార్లోంచి దిగుతున్న ఆ ముప్పయ్యేళ్ళ మత్తు కళ్ళ మెరుపు తీగను చూసాడు. చూస్తూనే అతని కళ్ళు ఆమె ఒంటికి అతుక్కుపోయాయి. అంతకుముందే స్లీవ్‌లెస్ బ్లవుజ్, సిల్కు చీర, బన్ను ముడి, మొగిలి సెంటు అతుక్కుపోయిన ఆ దంతపు రంగు శరీరానికి బుజురాయ్ చూపులు కూడా అతుక్కుపోవటంలో ఆశ్చర్యం లేదేమో!

" మిస్టర్ బుజురాయ్! మీ తవ్వకాల స్థలం భూస్వామి మిస్టర్ భూపతిరాజాను కలుస్తారా" అన్నాడు అంతకుముందే జీపులో నుంచి దిగుతున్న జిల్లా కలెక్టరు. సంభాషణంతా ఇంగ్లీషులో సాగింది అ ప్రాజెక్టు తాలూకు అధికారులు తెలుగు రాని ఉత్తరాధికారులు బుజ్‌రాయ్ తుళ్లి పడ్డాడు. కారుకి అవతలివైపు నుంచి దిగి చుట్టూ తిరిగొచ్చిన భూపతి రాజా బుజురాయ్‌కి నమస్కారం చేసి, తన పక్క కొచ్చిన ఆ మెరుపు తీగను , " నా భార్య తిలోత్తమా దేవి!" అని పరిచయం చేశాడు. ఇంకా అన్నాడు- " మిమ్మల్ని మారేడుమిల్లి రెస్ట్ హౌస్‌లోనే కలవాలని కలెక్టరుగారు చెబితే అక్కడ వెయిట్ చేశాము. మీరూ, కలెక్టరుగారూ, మేధానాధ్‌గారూ అక్కడ ఆగుతారనుకున్నాను. కానీ, మీ జీపు సరాసరి వచ్చేసింది " ..." యస్ యస్" అన్నాడు బుజురాయ్. మేధానాధ్ తోసహా అందరూ నమస్కారప్రతి నమస్కారాలు చేసుకొన్నారు.

***

రాత్రి ఎనిమిదయింది. అంతా భోజనాల బల్లచుట్టూ కూర్చుని భోజనాలు చేస్తున్నారు. భూపతి కలెక్టరుకు ఏదో సంజ్ఞ చేసాడు. కలెక్టరు " మీరే అడగండి" అన్నాడు బుజురాయ్ "యస్"అన్నాడు. భూపతి నీళ్ళు నములుతూ ఇలా అన్నాడు- " ఏంలేదు సార్, మీరు తవ్వకాలు ఉధృతం చేస్తున్నారు. భూమి రేటు తేల్చలేదు. ముందర అన్నీ గోతులు చేసేసి ఆ తరవాత గ్రాఫైట్ దొరకలేదని.. భూమి మీకొద్దంటే నేనేమయిపోవాలి? .. ఏదో ఎకరానికి పదివేలని తేల్చేస్తే ... "

బుజురాయ్ ఆశ్చర్యపోయాడు- " పదివేలా? అసలు ఐదు వేలైనా చేస్తుందా అని .. "

బతిమాలుతూ అన్నాడు భూపతి- " రంపచోడవరం మన్యందొర రాంభూపతి దేవ్ గారు ఒక విధంగా మా ముత్తాతగారని మేం చెప్పుకోవటమే గాని మా హయాం వచ్చేసరికి బతికి చెడినవాళ్ళమే అయ్యాం. దయతో మీరు గవర్నమెంటుకు ఆ పది రేటు రికమెండు చేస్తే... "

" సారీ, ఆ రేటు నేను రికమెండ్ చెయ్యలేను. రెండేళ్ళ క్రితం మా ఛీప్ సర్వేయరు రికమెండ్ చేసిన అయిదువేలకంటే పైసయినా అనవసరమే. ఆమ్లగుణం ఎక్కువ. నత్రజని తక్కువ. సారం లేని ఈ భూమికి అంతకంటే ఎక్కువ గిట్టదు."

కలెక్టరు భూపతివైపు చిరాగ్గా చూశాడు. భోజనాలయ్యాక భార్యాభర్తల్ని తీసుకుని ఫియటూ, కలెక్టర్ని తీసుకొని జీపూ వెళ్ళిపోయాయి.

***

మర్నాడు రాత్రి కడిమి చెట్టు క్రింద ఒంటరిగా కూర్చొనున్నాడు స్పెషలాఫీసర్ బుజురాయ్. దూరంగా ఫెన్సింగ్ అవతలికి ఫియెట్ కారొచ్చి ఆగింది. తిలోత్తమాదేవి సొగసులొలికించుకుంటూ లోపలికొచ్చింది. ఆమెతోపాటు కస్తూరి సెంటు కూడా ఆ ఇద్దరికీ మధ్యకొచ్చేసింది. నమస్కార ప్రతినమస్కారాలయ్యాయి. మత్తుకళ్ళతో ఒత్తుగా, ఓరగా చూస్తూ తిలోత్తమ మెల్లగా అంది "ఎక్స్‌క్యూజ్‌మి సర్.. కొంచెం మీతో పర్సనల్‌గా మాట్లాడాలి . లోపలికి వెడదామా?" బుజురాయ్ ఆమెను పరీక్షించి చూశాడు. లోపల లంగా బాడీల్లేకుండా పల్చని చీరె జాకెట్టులతో మాత్రమే ఆమె వచ్చింది "అక్కర్లేదు ఇక్కడే చెప్పండి!" ఖంగున కర్కశంగా మోగింది అతని కంఠం.

ఆమె బెదిరింది. అంది-" క్షమించండి మాకు మిగిలిన ఆస్తి ఈ పదెకరాలే.. పిల్లలుగల వాళ్ళం... మీరు పదివేల రేటిప్పించకపోతే బతకలేం... మీ ఋణం ఉంచుకోనేవాళ్ళం కాదు.. ఇది యాభైవేలు... మీరు కోరితే .. ఇంకా ఎంతైనా . ఏదైనా సరే. . సంతోషంగా... నో అబ్జెక్షన్ " ఆమె తన చేతిలో సూట్‌కేస్‌ని అతని కుర్చీ పక్కగా అతని చేతికి తన చేతిని తగిలిస్తూ కింద పెట్టింది. జారని పమిటని అలవోకగా వోసారి సర్దుకుంది. ఋజురాయ్ మొహం కోపం కక్కింది. చటుక్కున నుంచున్నాడు. అన్నాడు- " నేనూ పిల్లలు గలవాడినే తిలోత్తమగారూ! అందుకనే పాపిష్టి పనులు చెయ్యలేను!" ఋజురాయ్ విసవిసా లోపలి కెళ్ళిపోయాడు. నిముషం తర్వాత సూట్‌కేస్‌నీ, తిలోత్తమనీ ఎక్కించుకుని భూపతి వెనక్కు మళ్ళాడు.

★★★

జియాలజిస్ట్ డాక్టర్ మేధానాధ్‌ని, కేంద్ర ప్రభుత్వఆర్థిక శాఖ స్పెషలాఫీసర్ ఋజురాయ్‌నీ ఆ ప్రాజెక్టు తాలూకు ప్రాజెక్టాఫీసరు లోయలోతట్టుకి తీసుకెళ్లి పూర్వం ప్రాథమిక తవ్వకాలు జరిగిన చోట్లనూ, ఇప్పుడు సమగ్ర పరిశోధన కోసం తవ్వకాలు జరుగబోతున్న చోట్లనూ చూపించాడు. ఋజురాయ్ మేధానాధ్ తో " మీరు కాలిఫోర్నియా కాంగ్రెస్‌కి వెళ్ళవలసింది సెప్టెంబర్లోననుకుంటాను, కదూ?... మీరు ఇక్కడ గ్రాఫైట్ దొరికే విషయమై సమగ్ర పరిశోధన మీద రిపోర్టు ఇచ్చి వెళ్ళాళి... తొమ్మిది నెలలుగడువన్నమాట!" అన్నాడు. ముఖ్యమైన సూచనలేవో ఇచ్చాడు. ఆరోజే ఢిల్లీకి ప్రయాణమై వెళ్ళిపోయాడు.

వారం రోజులు గడిచాయి. ఒక ఆదివారం మేధానాధ్ కొనుగోళ్ళకోసం రంప చోడవరం వెళ్లాడు. అతను తిరిగొచ్చేసరికి వాచ్‌మెన్, " ఎవరో మీ స్నేహితులట సార్, మీరు తెమ్మన్నారని ఈ క్రోటను మొక్కలు తెచ్చిచ్చారు" అంటూ ఒక పాతిక ముప్పై మొక్కలున్న కట్ట చూపించాడు. " నేనెవర్నీ అడగలేదే!... సరే, తీసుకెళ్ళి బాత్‌రూమ్ నీటి గుంట దగ్గర పడేయ్" అన్నాడు మేధానాధ్. నాలుగు మొక్కల్ని ఆఫీసు గుమ్మంలోనూ మిగిలిన వాటిని నీటిమడుగు చుట్టూతాను నాటాడు వాచ్‌మెన్.

★★★

నెల రోజులు గడిచాయి. తవ్వకాలు సాగుతున్నాయి. మర్నాడు డైనమైట్‌పెట్టి నేల పేల్చి ఇంకా లోతుకెళ్లడానికి ప్రాజెక్టు ఆఫీసరుతో కలిసి మేధానాధ్ పథకాలేస్తుండగా రాజమండ్రి కాలేజీ బాటనీ లెక్చరర్ వచ్చి గనుల తవ్వకం చూడడం కోసం తనూ వచ్చానన్నాడు. అతనికి అంతా చూపించాక, మేధానాధ్ అతన్ని ఆ రాత్రి తనకు అతిథిగా ఉండమని కోరి ఒప్పించాడు. కాంప్ ఆవరణలోకి వస్తూనే ఆ లెక్చరరు దూరంగా బాత్‌రూమ్ నీటిగుంట చుట్టూ కనిపిస్తున్న గుర్రపు డెక్క మొక్కల్ని చూసి "ఈ అడవిలోకి కూడా ఈ మొక్కలొచ్చేసినయ్యా - ఎయ్‌కొర్నియా క్రాసిసెన్- పాంటడేరియేసి ఫామిలీ!" అన్నాడు. " ఏం వస్తే నష్టమేమిటి?" అన్నాడు మేధానాధ్.

చురుగ్గా చూశాడు లెక్చరర్ "అంతా నష్టమే ఈ నీటి మొక్క దుబ్బులు దోమకు పుట్టినిల్లు. చాలా వూళ్ళల్లో మలేరియా, ఫైలేరియాలు ఎక్కువ అవడానికి ఈ దుబ్బు మొక్క ఒక ముఖ్య కారణం"..." అయితే పీకేసి నాశనం చెయ్యొచ్చుగా!" నవ్వాడు లెక్చరర్. "అదంత సులభం కాదు డాక్టర్! దీని విత్తనాలు నేలలో ఇరవై ఏళ్ళు జీవిస్తాయి. అనుకూల పరిస్థితుల్లో మొలకెత్తుతాయి. ఇవ్వి

నీటిమీద తేలటమేకాదు. గాలిలో కొట్టుకు పోయి ఇతర మడుగుల్లో కూడా మొలకెత్తుతాయి. ఒక్క మొక్కని నీళ్ళలో వదిలితే దాని దుబ్బుల్లో నుంచి వచ్చే కాడ ద్వారా కూడా వారానికో రెండు మూడు నెలల్లో ఎకరం చెరువును మూసేస్తుంది. చేపలు బతకటం కష్టం. దీన్ని పూర్తిగా నిర్మూలించలేక చాల దేశాలవాళ్ళు దీని ఉపయోగం కోసం వెతుకుతున్నారు. !"

"ఐ.సీ"..."ఇంతకీ ఈ మొక్క ఇక్కడ కెట్లా వచ్చింది?... కిందటేడాది నేను బొటానికల్ టూర్ కొచ్చినప్పుడు ఈ ప్రాంతాల్లో ఎక్కడా లేదే!"

సాలోచనగా మేధానాథ్ అన్నాడు- "ఎవరో క్రోటన్సు పంపారు. ఆ మొక్కల్లో కలిసి పోయి వచ్చిందనుకుంటాను. "

★★★

ఆ రాత్రి భోజనాల దగ్గర ఆ అడివి గురించిన ప్రసక్తి వచ్చింది. లెక్చరర్ అన్నాడు " అట్లా పైకి పాపికొండల్లోకి పోయినకొద్దీ అడవిదట్టంకదా .. అక్కడ మాంసాహార వృక్షాలున్నాయేమో తెలుసా మీకు?" మేధానాథ్ ఆశ్చర్యపడ్డాడు- " మాంసాహార వృక్షాలా! అసలు అవ్వంటూ ఉన్నాయని నేనెప్పుడూ వినలేదే!"

" నేను విన్నాను. దక్షిణ అమెరికాలో అమెజాన్ నదీ ప్రాంతంలో దట్టమైన చీకటి అరణ్యాల్లో ఉన్నాయట.. అసలెట్లాగూ కీటకాల్ని తినే మొక్కలున్నాయి గదా!"

" కీటకాల్నితినే మొక్కలా! ఇంకా ఆశ్చర్యంగా ఉందే".. లెక్చరర్ తన భోజనం ముగించాడు. చేతులు తుడుచుకుంటూ అన్నాడు- " చెప్పమంటారా! కీటకాల్ని తినే మొక్కలు రెండు రకాలు. ఒకటి తమ ఆకుల మడతల్లో కీటకాల్ని నొక్కి పట్టి చంపి తినేవి రెండు కూజా ఆకారంలో ఉన్న తమ ఆకుల్లోకి ఏమాత్రం కదలిక లేకుండా కీటకాల్ని ఆకర్షించి తినేవి!" ... " ఆకులు పురుగుల్ని చంపటమా!" ... "అవును నిజం, సార్! ఇంకా చెప్పమంటారా? ఈ మొక్కలకి ఎర్రని ఎరుపు రంగులో గుండ్రని ఆకులుంటాయి. ఆకులపై భాగాన నుంచో బెట్టిన అగ్గిపుల్లవంటి సన్నని వెంట్రుకలుంటాయి. ఆ వెంట్రుకల పై చివర్లలో చిన్న చిన్న బల్బులుంటాయి. ఆ ఆకుల రంగూ, ఆ బల్బులూ సూర్యకాంతిలో మెరుస్తూ సువాసన వెదజల్లుతూ కీటకాలని ఆకర్షిస్తాయి . కీటకం వచ్చి ఆ బల్బుల్ని తగిలీ తగలగానే వాటిల్లోంచి జిగురు ద్రవం వూరుతుంది. కీటకాలు బల్బుకి అంటుకుపోతాయి. తక్షణం ఆ వెంట్రుకలు ఆకుమధ్యభాగంవైపు వంగి కీటకాన్ని ఆ మధ్య భాగంలోకి నొక్కి పడతాయి. ఇప్పటికే ఆ మద్యభాగంలో వూరిన జీర్ణరసం కీటకం అవయవాల్ని కరిగించటం మొదలుపెడుతుంది. విచిత్రమేమిటంటే, ఆ సన్నని వెంట్రుకలు వెనక్కి లేచి, మళ్లీ లోపలికి వంగి, మళ్లీ లేచి మళ్లీ వంగి, ఇట్లా మూడుసార్లు చేసి కీటకాన్ని మరిహ ఎగిరిపోవడానికి వీల్లేకుండ ఆకుకు అంటించేస్తాయి. ప్రధానంగా ఇదొక వెరైటీ.

" ఇంకో వెరైటీ మొక్కలకి ప్రతి ఆకూ , దాచిచుట్టూ రంపం పళ్ళున్నట్లుండే అంచుతో తెరచిన కజ్జికాయ చెక్కలాగా ఉంటుంది. ఆ ఆకు కూడా తన రంగూ తన ద్రవం సువాసనలతో కీటకాన్ని ఆకర్షిస్తుంది కీటకం వచ్చి ఆ ఆకుమీద వాలగానే కజ్జికాయ చెక్కలు ముడుచు కొన్నట్లుగా తన నిలువు ఈనె వెంబడి ఆ ఆకు టప్పున ముడుచుకుంటుది. ఆ బంధం ఎంత గట్టిదంటే లోపలున్న కీటకం అవయవాల ఒంపులు ఆకుపైనుంచి మనకు కనిపిస్తాయి కూడా!

★★★

"మూడోరకం మొక్కలో ఆకుకు కీటకం తగలగానే తివాచీలాగా ఆకురెండు అంచులూ నిలువు ఈనె వైపుకి, లోపలికి, చటుక్కున చుట్టుకుపోతాయి. ఆకుజిగురువల్ల ఆ ఆకుకు అంటుకుపోయిన కీటకాన్ని రెండుమడతలు మధ్యలో పెట్టి దాని అవయవాలు విరిగేటట్టు నొక్కేస్తాయి. ఇదంతా ఒక సెకనులో పదోవంతు కాలంలో జరుగుతుంది.

"ఇంకోరకం మొక్క మంచినీటి మడుగుల్లో నీటి ఉపరితలం కింద అడ్డంగా కాడలా పెరుగుతూ ఉంటుంది. నాలుగు ఈనెలు. ఆ ఈనెల మధ్య పారాచూట్ ఆకారంలో వుండే ఒక తిత్తి లాగా దీని ప్రతి ఆకు చీలి ఉంటుంది. ఇలా కాడకు అటూ ఇటూ ఆకులు వుంటాయి. ఈ కాడకు చివర పూలు పూసే ఇంకొక కాడ పుట్టి నీటి పైకి నిలువుగా పెరిగి పూలతో మనకు కనిపిస్తుంటుంది. నేలలో సంచరించే దోమలు వగైరాల కీటకాల లార్వాలు, ఇతర చిన్న పురుగులు ఈదుకుంటూ వచ్చి ఈ మొక్క ఆకులో భాగమైన ఈనెను తగిలినప్పుడు ఆ ఈనెకి కిందగా వుండే తిత్తి పైన వుండే ద్వారం చటుక్కున తెరుచుకుంటుంది. తిత్తి లోపల అంతా శూన్యప్రదేశమవ్వటంచేత ఇక్కడున్న నీరు చటుక్కున ఆ తిత్తిలో ప్రవేశిస్తుంది. ఈ నీటితో బాటే ఈ క్రిమికూడ లోపలికి తక్షణం దూరి పోతుంది. అయితే ఆ ద్వారంకింద ఉండే వాల్వు వంటి అమరిక, లోపలున్న నీటి చుక్కనైనా సరే తప్పించుకొని బయటికి అంటే- వెనక్కి పోనీయదు. లోపలి కీటకం వూపిరాడక ( దోమల లార్వాకు బయటి గాలి పీల్చుకునే గొట్టం ఏర్పాటు దాని శరీరంలోనే ఉంది) ఉక్కిరి బిక్కిరై చనిపోతూండగానే తిత్తిలోని గోడల్నుంచి ఉత్పన్నమయ్యే జీర్ణరసాలు దాన్ని జీర్ణం చేసేసుకుంటాయి. జీర్ణమయే భాగం జీర్ణమయి ఆగోడలచేతే పీల్చుకోబడ్డ తర్వాత - అంటే సుమారు పదిహేను ఇరవై నిమిషాల తర్వాత ఆ తిత్తి తెరుచుకుంటుంది. లోపలినీటిని కీటకం తాలూకు జీర్ణంకాని మిగిలిన భాగాల్ని గోడలు బయటికి తోసేస్తాయి. ఇంతా చేసి ఆ మొక్క పొడుగు ఆరు అంగుళాలు. వెడల్పు- ఆకులతో కలుపుకుని అంగుళం లోపే... "

" అద్భుతం! ఎంతో అమాయకంగా కనిపించే ఈ సృష్టిలో ఇంతటి ఇంజనీరింగ్ పనితనమా!" అన్నాడు మేధానాథ్. ఇంకా ఆ మాంసాహార మొక్కల ఉనికిగురించీ వాటి కుటుంబాల చరిత్ర గురించి కూడా వివరంగా చెప్పాడు లెక్చరరు.

★★★

తొమ్మిదయింది. తవ్వకాల స్థలానికెళ్ళడానికని ప్రాజెక్టాఫీసరుతో కలిసి బయటకొచ్చిన మేధానాథ్‌కు గేటు దగ్గర ఒక ఇరవై మంది గిరిజనులు వాచ్‌మెన్‌తో గొడవ పడుతుండడం కనిపించింది మేధానాథ్ ను చూసి వాళ్లు గబగబ దూసుకొచ్చి చుట్టుముట్టారు. ప్రాజెక్టాఫీసరు వాళ్ళ మాటల్ని ఇంగ్లీషులోకి అనువదించి మేదానాథ్‌కు చెప్పాడు.

" సోకుల వలస, నెల్లూరు, లక్ష్మణలొవ గూడాల వాళ్ళంటండీ వీళ్లు . ఈ చుట్టూ మైలు కైవారంలో ఉన్నవాళ్లు. వాళ్ళ మంచి నీళ్ళ చెరువుల్లో విషం మొక్కలు మొలిచి దోమల్ని పుట్టిస్తున్నాయట. ఆ మొక్కలు పూర్వం ఇక్కడ లేవుట. మీ గది చుట్టూ పెట్టుకోవటం కోసం వాటినితెచ్చింది మీరేనట. మంచి నీలం పూలు పూస్తాయని చెప్పి నెల రోజుల కిందట ఎవడో ఒకడు మీరు నాటమన్నారు అని- అంటూ వాటిని వాళ్ల చెరువుల్లో నాటాడట. ఆ మొక్కలిప్పుడు వాళ్ల చెరువులన్నీ ఆక్రమించేయట.దోమలు

విజృభించడానికి కారణం మీరేనంటున్నారు... మనం పని ఆపేసి వెళ్ళిపోవాలట. పూర్వమెప్పుడో తగ్గిపోయిన మలేరియా మళ్ళీ వస్తే మాత్రం సహించలేమంటున్నారు."

ఇంకా తికమక పడ్డాడు మేధానాధ్ " రేపు మనం వెళ్లి వాళ్ళ చెరువులు చూస్తామని చెప్పండి. చేతనైనంత సహాయం చేస్తామని మాటివ్వండి. ఈ మొక్కలు విస్తరించటానికి కారణం మనం మాత్రం కామని చెప్పండి." ప్రాజెక్టాఫీసరు తెలుగులోకి అనువాదం చేసి చెప్పిన దాన్ని వాళ్ళు విన్నారు. గొణుక్కుంటూ వెళ్లిపోయారు. మేధానాధ్ హడావుడిగా లోపలి కొచ్చాడు. జిగురుపూసిన పళ్ళాన్ని బాత్‌రూమ్ నీటిగుంట మీద విసరి పది పన్నెండు దోమల్ని పట్టుకున్నాడు. మైక్రోస్కోపు కింద వాటినిపరిశీలించాడు. అదిరి పోయాడు! చుక్కల రెక్కల్తో తలకిందకి పెట్టి నిట్టనిలువుగా నుంచునున్న రెండు దోమలు! మలేరియా దోమలు! ప్రతి పదింటిలో రెండు! హడావుడిగా ప్రాజెక్టాఫీసర్ని రంపచోడవరం పంపించాడు. మలేరియా నిర్మూలన డిపార్ట్‌మెంటు సూపర్వయిజర్స్‌ని రప్పించాడు. అంతా కలిసి చెరువు దగ్గరికెళ్ళి చూశారు . గుర్రపు డెక్క విపరీతంగా వ్యాపించుంది. సూపర్‌వైజరు ఆ మొక్కలన్నింటినీ నీళ్ళలోంచి పీకించి గట్టు మీదెండేయించాడు. గూడాలలో క్వినైన్, సింకోనా బిళ్లలు పంచాడు. నీళ్ళల్లో డి.డి.టి, ఫినైల్ చల్లబోతే అవి తాగేనీళ్ళు కావటం వల్ల గిరిజనలు అందుకు ఇష్టపడలేదు.

ఒహ పట్టాన చావనిది కదా ఈ వాటర్ హైయాసిన్త్ . దీని దుబ్బుల్లో పెరిగే దోమని నిర్మూలించడం ఎట్లా అనుకున్నాడు మేధానాధ్. మర్నాడు నలుగురు పనివాళ్ళకు మలేరియా సోకింది. దాంతో పనివాళ్ళెవ్వరూ పన్లోకి రామన్నారు. అసిస్టెంట్లొచ్చి మేధానాధ్ తో " దోమ తగ్గేదాకా సెలవిప్పించండి." అనడిగి, "సరే" అనిపించుకుని వాళ్ళ వూళ్లకు ప్రయాణమై వెళ్ళిపోయారు. తనకిచ్చిన గడువులోపల తవ్వకం పని పూర్తి చెయ్యలేనేమోనన్న ఆదుర్దా, తన కారణంగా అక్కడింక ఏ గవర్నమెంటు ఉద్యోగీ పని చెయ్యలేనంతగా గిరిజనులకు అనుమానం కలగటం, తన మూలంగా వాళ్ల ఆరోగ్యాలు పాడవటం- వీటితో తనేదో ఒకటి చెయ్యాలనుకుంటూనే ఏంచెయ్యాలో తెలీక అయిదారు రోజులు అస్థిమితంగా గడిపాడు మేధానాధ్.

★★★

హఠాత్తుగా వచ్చిన ఆలోచన్ను ఆచరణలో పెట్టటానికి బాటనీ లెక్చరర్‌ను పిలుచుకు రమ్మనమని ప్రాజెక్టాఫీసర్‌ని రాజమండ్రి పంపాడు మేధానాధ్ . అతను రెండు పుస్తకాల్తో తిరిగొచ్చి, లెక్చరర్ తనకు రావటానిక వీల్లేదని ఆ పుస్తకాల్నిచ్చి పంపాడని చెప్పాడు. మేధానాధ్ బాటనీ పుస్తకం తెరిచాడు. చదివాడు....

డ్రోసెరా రోటండీ ఫోలియా: ప్రధానంగా అమెరికా మొక్క- ఇతర ఉష్ణమండలాల్లోనూ బ్రిటన్‌లోనూ అరుదు. నేలలో ఎక్కువ కాల్షియాన్ని ఈ మొక్క భరించలేదు.

అల్ డ్రోనాండా : ఆఫ్రికా , ఇండియా , జపాన్ దేశాల మొక్క. మంచినీటి మడుగుల్లో నీటి మొక్కల మధ్య పెరుగుతుంది... కోరింత దగ్గుకు మంచి ఔషధం.

ఈరెండూ డ్రోసెరేసే కుటుంబంలోని వంద రకాల్లోని మొక్కలు. వీటికి జీవితకాలం రెండు మూడేళ్లు. ఆకుకూ కాండానికీ మధ్యనించి పూగుత్తుల కాడలు, వాటివల్ల విత్తనాలు... విత్తనాల ద్వారానే కాక కాండం ద్వారా కూడా వ్యాప్తి. ఆమ్లలక్షణం కలిగుండి నత్రజని సారం తక్కువగా ఉండే నేలల్లో నీటి

నెపెంతిస్ అంప్యులారియా : ఉష్ణమండలాల మొక్క. నెపెంతసె కుటుంబంలోని ఎనభై రకాల్లో ఇదొకటి. నీటి అంచులు, చెట్ల కొమ్మలూ, కుళ్ళుతున్న పచ్చి రొట్టా దీనికి బాగా అనుకూలం. విత్తనాల ద్వారా మాత్రమే వ్యాప్తి. సముద్ర మట్టంనించి 600-700 మీటర్ల ఎత్తులో మనుగడ. జంతువుల చర్మాన్ని చీల్చి రక్తాన్ని పీల్చలేక పువ్వుల మకరందంపై ఆధారపడి జీవించే మగదోమలూ, మరికొన్ని ఇతర రకాల దోమలూ, చిన్న ఈగలూ, అడవిచీమలూ దీనికి బలి అవుతాయి.

మేధానాథ్ జువాలజీ పుస్తకం తెరిచాడు. దోమగురించి చదివాడు. మనాటీ రకం చేపలూ ,ఒక రకం గబ్బిలాలూ దోమ లార్వాను అరికట్టగలవు. అయితే అవి పర్వత ప్రాంతాల్లో జీవించలేవు. కొన్నిరకాల నీటి మొక్కలు ఎంత ఎత్తులోనైనా దోమను అరిగట్టగలవు. మగదోమ నశిస్తే ఆడదోమ నశిస్తుంది...

ఈ విజ్ఞానం అతనికి విపరీతమైన ఉత్సాహాన్నిచ్చింది. ఆ అడివి ప్రాంతం 600 మీటర్ల ఎత్తున ఉన్నదనే విషయమూ, భూవాతావరణ పరిస్థితులు అమొక్కల పెరుగు దలకు అనుకూలంగా ఉంటాయనే విషయమూ అతని ఉత్సాహాన్ని రెట్టింపు చేశాయి.

అతను వెంటనే కలకత్తా , గౌహతీ, కొడైకెనాల్ లోని తన మిత్రులకు, కొలంబోలోని మరో మిత్రుడు ప్రొఫెసర్ శిరోరత్న నాయకేకూ తనకా మొక్కల విత్తనాలు పంపవలసిందిగా కోరుతూ టెలిగ్రాము లిచ్చేశాడు. ఆ మర్నాడు అతని తండ్రికి జబ్బుగా ఉందని టెలిగ్రాం వస్తే మేధానాథ్ తక్షణం పాట్నాకు బయల్దేరి వెళ్లిపోయాడు.

★★★

నెలన్నర గడిచాక మేధానాథ్ మారేడుమిల్లికి తిరిగొచ్చి చూసేసరికి చెరువుల అంచుల వెంబడే కుళ్లుతున్న టేకు, మద్దీ ఆకుల గుట్టల్లో కూడా బోనుమొక్కలూ ( నెపెంతిస్), చెరువుల నీళ్లల్లో తిత్తిబోను (అల్ డ్రోనాండా) మొక్కలూ వ్యాపించివున్నాయి. వెంట్రుకబోను (డ్రోసెరా) మొక్కలు మాత్రం ఎక్కువ బలంగా మొలవ లేదు. వెంట్రుకల బల్బుల్లో జిగురు అంతగా లేదు.

మేధానాథ్ నీటి అంచునున్న ఒక కూజాబోను మొక్కను పరిశీలించాడు. అది ఆరుంగుళాలు ఎదిగుంది. దాని కూజాలు చేతి బోటనవేలు సైజులో నేలనుంచి అన్ని దిక్కుల్లోకి వాలి ఉన్నాయి. అతను తన చూపుడువేలు ఒక కూజాలోకి గుచ్చి తీస్తూంటే అంచువెంబడి లోపలికి వెళ్తున్న సన్నని వెంట్రుకలు తగిలాయి. వేలి చివర జిగురు అంటింది. అంతవరకూ అక్కడ పైన నిశ్శబ్దంగా తిరిగిన యానోఫిలిస్ పిల్లదోమ ( మలేరియా దోమ) కూడా అంచున వాలింది. తన తొండాన్ని లోపలికి పొకించి వెతికింది. కొంచెం లోపలికి జరిగింది. మకరందం అందలేదు కాబోలు . ఇంకొంచెం లోపలికి జరిగింది ఉహూ, ఇంకా అందలేదు. ఇంకొంచెం జరిగింది. వెంట్రుక పైభాగాన వాలుగా ఇంకొంచెం ఇంకొంచెం, ఇంకొంచెం. టప్! ఫినిష్! పడిపోయింది లోపలికి! ఇంకో నాలుగ దోమలు ఎగురుకుంటూ వచ్చాయి. కూజాలపైన వలయాలు తిరుగుతున్నాయి. ఇంతలో గూడేల నాయకులొచ్చారు. దోమ చాలా వరకూ తగ్గిపోయిందనీ, తమకిక మలేరియా భయంలేదనీ అన్నారు. మేధానాథ్ గుండె ఆనందంతో నిండిపోయింది

వెంటనే మేధానాధ్ తన బసకొచ్చాడు. ఢిల్లీకి ఆర్థికశాఖ స్పెషలాఫీసర్ బుజురాయ్‌కి ఉత్తరం రాశాడు. " భూపతిరాజా ప్రయోగించిన మన్మధుని బోనుకు మీరు చిక్కలేదు. సంతోషం! ఆ కసితో ఇక్కడి చెరువుల్లో వాటర్ హైయాసింత్‌ను అతను ప్రవేశబెట్టి మలేరియా దోమని హరాత్తుగా పెంచి గిరిజనులకు నామీద అనుమానం కలిగించాడు. ఈ బోన్నుండి దూరంగా ఈసారి నేను తప్పుకున్నాను. ఎట్లాగంటే - మాంసాహార మొక్కల్ని చెరువుల్లో ప్రవేశబెట్టాను. వాటి ఆకులు ఆ దోమలకు మన్మధుని మకరందపు బోనులయ్యాయి. చాల దోమ నశించింది. ఇప్పుడు గిరిజనుల్లో నాపట్ల గౌరవం పెరిగింది. హైయాసింత్ పక్కన ఆల్ డ్రోనాండాను పెంచటం దోమ నివారణకు ఒక శాశ్వత పరిష్కార మవుతుందేమో తెలియదు.

" భయంకరమైన హైయాసింత్‌ను ఇక్కడ ప్రవేశపెట్టి తప్పించు కున్నందుకు భూపతిరాజాకు ఎటువంటి బోను ఎట్లా వెయ్యాలో జాగ్రత్తగా ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉందని నా మనవి."

★★★

నెగడు మండుతోంది. మేధానాధ్, బోటనీ లెక్చరర్, ప్రాజెక్టాఫీసర్ల చేతుల్లో వెదురుగొట్టాల్లో ఉప్పు సన్నగా కలిసిన వెదురు బియ్యమూ, పక్కనే ఆకు మడతల్లో నలిగిన ఇప్పపూవూ ఉన్నాయి. తుడుము, కలికం, వంశి వాద్యాల స్వరాలకి అనుగుణంగా పిల్లా పెద్దా, ఆడా మగా గిరిజనులు అందరూ మూడు వరసల్లో అర్ధ చంద్రాకారంగా చేతులుపట్టుకొని అడుగులుముందుకూ పక్కలకు వేస్తూ మహానందంగా నాట్యం చేస్తున్నారు. లయతోనూ తమిళం కలిసిన తెలుగులోనూ వాళ్లు పాట పాడుతున్నారు.

"ఒఁఓఁఓఁ నాయక
దోమాను చంపీన నాయక
ప్రాణబిక్షాను పెట్ని నాయక
నీభార్యాబిడ్డాలంత నాయక
చల్లంగా ఉండాలి నాయక
మాకొండల్లకోనల్ల నాయక
మారాజు నీవయ్య నాయక
మాతోటి ఉండయ్య నాయక
సరళాదేవాత ఆనయ్య నాయక
కొండా ముత్యామ్మ ఆనయ్యనాయక
నీకు జయమాగుతుండాలో నాయక
నీకు జయమాగుతుండాలె నాయక నీకు"

ఆనందోత్సవ సంరంభం మృదుమధురంగా ఆ కొండలోయ అంతటా ప్రతిధ్వనిస్తోంది. చంద్రుడు ఒళ్లంతా కళ్లు చేసుకుని మరీమరీ చూస్తున్నాడు.

( ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 20-4-83)

★★★ ★★★ ★★★